
# ఎబిసిడి... అఆఇఈ...

ఆస్టిన్‌లోని బాస్‌కాంసర్ట్ హాల్‌లో, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ వారి కాన్వకేషన్ జరుగుతున్నది. ఈశ్వర్రావ్ - ప్రమీల వాళ్ల అబ్బాయి ప్రభు ఇంజనీరింగు డిగ్రీ తీసుకో బోతున్నాడు. అందుకని వాళ్లతో బాటుగా వాళ్ల మంచి స్నేహితులు కనుక విక్రమరావ్, సునీతలు కూడ వచ్చారు కాన్వకేషన్‌కి.

డిగ్రీలు తీసుకుంటున్న స్టూడెంట్స్, ఒక గంట ముందే రావాలి కనుక ముందుగా వచ్చి, బయట లాన్‌లో నుంచున్నారు విక్రమరావ్, సునీత, ఈశ్వరరావ్, ప్రమీల. చుట్టూ పిల్లలతో. పిల్లల తల్లిదండ్రులతో, మిత్రులతో, కుటుంబ సభ్యులతో చాల సందడిగా ఉత్సాహంగా ఉంది. డిగ్రీలు తీసుకోబోయే పిల్లలందరూ, కాన్వకేషన్ డ్రెస్‌లో అందంగా మెరిసి పోతున్నారు. ప్రభు కూడా, డ్రెస్ సరిచేసుకుని, వాళ్ళతో కలిసిపోయాడు.

అప్పుడే వచ్చాడు రవి. రవిది ఇండియాలో విక్రమ రావ్ వాళ్ళ వూరే. అక్కడ ఇంజనీరింగ్ పూర్తిచేసి వచ్చి, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఎం.ఎస్. చేస్తున్నాడు - మధ్య మధ్యలో ఆస్టిన్ నించి, హ్యూస్టన్ వచ్చి విక్రమరావ్‌ని కలిసి, సునీత చేతి వంటను రుచి చూసి వెడుతుంటాడు. చాల కలుపుగోలు మనిషి.



"ఏం సార్ బాగున్నారా?" అన్నాడు విక్రమరావ్‌తో. సునీతకి నమస్కారం చేశాడు. ఈశ్వరరావ్‌నీ, ప్రమీలనీ పరిచయపూర్వకంగా పలకరించాడు.

"ఏం రవీ! నీ డిగ్రీ ఎప్పుడొస్తుంది?" అడిగాడు విక్రమరావ్.

"వచ్చే సెమిస్టర్‌లో అయిపోవాలండీ!" అన్నాడు. అని - "ఈసారి మనవాళ్లు చాలా మంది ఎబిసిడిల డిగ్రీల తీసుకుంటున్నారే!" అన్నాడు.

విక్రమరావ్‌కి, ఈశ్వరరావ్‌కీ, సునీతకి తెలును

ఎబిసిడి అంటే ఏమిటో, ప్రమీల మాత్రం వింతగా చూసింది. ఎబిసిడి అంటే ఏమిటని అడిగింది.

రవి కొంచెం ఇబ్బందిగా నవ్వాడు - "నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. అది నేను కనిపెట్టిన మాట కాదు. మామూలుగా యూనివర్సిటీలలో మనవాళ్లు వాడేదే" రవి చెప్పటం ఆపాడు. అందరూ లోపలికి పోవటం చూసి.

"రండి మనమూ వెడదాం - వీళ్లు టైము ప్రకారం జరిపేస్తారు అన్నీ" అన్నాడు టైము చూసుకుంటూ.

అందరూ లోపలికి వెళ్ళి కూర్చున్నారు. అది చాలా పెద్ద హాలు. దాదాపు మూడువేల మంది పడతారేమో. పోయినసారి పండిట్ రవిశంకర్ సితార్ కచ్చేరికి వచ్చాడు అక్కడికి. హాలంతా నిండిపోయింది. ఈ రోజు అంతమంది లేరు కానీ, చాలామంది వచ్చారు.

డిగ్రీలు తీసుకునే స్టూడెంట్సూ, స్టాఫ్ వస్తుంటే అందరూ లేచి నుంచున్నారు. పియానో, వయలిన్ల మీద చక్కటి సంగీతం వినిపిస్తున్నారు.

రెండు ప్రక్కల నించీ స్టూడెంట్సు వచ్చి, ముందు ఏడెనిమిది వరసల్లో కూర్చున్నారు. అందరూ నుంచుని ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. వాళ్ళు రాగానే, స్టాఫ్ అంతా వచ్చి స్టేజ్ మీద బారులు తీరి కూర్చున్నారు. వాళ్ళందరూ వచ్చాక ప్రేక్షకులు కూర్చున్నారు.

డీన్ మాట్లాడుతున్నాడు చాలా సరదాగా, హాస్యంగా. తర్వాత కొంతమంది మాట్లాడాక, సాలుటుటోరియన్ తర్వాత వారి డిక్టోరియన్ మాట్లాడారు. తర్వాత డిగ్రీల ప్రదానం. డిగ్రీలు తీసుకుంటున్నప్పుడు, వాళ్ల కుటుంబ సభ్యులూ, మిత్రులూ లేచి నుంచుని పెద్దగా అరుస్తూ చప్పట్లు కొడుతున్నారు. ప్రభు వస్తున్నప్పుడు ఈశ్వరరావ్, వీడియో తీస్తూ ముందుకు వెళ్లాడు. ప్రమీల ఫొటోలు తీస్తున్నది. విక్రమరావ్, సునీత, ప్రభు మిత్ర బృందం చప్పట్లు కొడుతున్నారు. రవి పెద్దగా విజిల్ వేశాడు.

"కంగ్రాట్యులేషన్సండీ - మీవాడు ఇంజనీర్ అయిపోయాడు" అన్నాడు విక్రమరావ్, ప్రమీలతో.

కాసేపటిలో కార్యక్రమం పూర్తయింది. స్టూడెంట్సూ, స్టాఫ్ అందరూ ఒకళ్ళనొకళ్ళు కావలించుకుంటున్నారు. కొంతమంది కన్నీళ్ళతో, మిత్రులకు వీడ్కోలు యిస్తున్నారు. అందరూ బయటకు వచ్చి, లాన్‌లో పూలచెట్ల దగ్గర నుంచుని, అప్పుడే చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగ వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభించబోతున్న పిల్లల ఉత్సాహాన్ని చూస్తున్నారు. ఒక పావుగంట తర్వాత ప్రభు వచ్చాడు. అందరూ కలిసి దగ్గరలో వున్న లెబనీస్ రెస్టారెంట్‌కి వెళ్లారు.

రవి అడిగాడు ప్రభుని తెలుగులో - "తర్వాత ఏంచేస్తావ్? ఎం.ఎస్. చేస్తావా? - ఉద్యోగంలో చేరతావా?" అని.

ప్రభు - ఇంగ్లీష్‌లో సమాధానం ఇచ్చాడు - "జాబ్‌లో చేరతాను. రెండు, మూడు రెడీగా వున్నాయి. ఏది తీసుకునేదీ ఇంకా నిర్ణయించుకోలేదు!" అని.

ప్రమీల రవిని అడిగింది - "ఇందాక - ఎబిసిడి అంటే ఏమిటో చెప్పకుండా దాటేశావ్ - ఏమిటి?"



"మీకింకా గుర్తుందా?" నవ్వాడు రవి.

విక్రమరావ్ అన్నాడు - "ప్రమీలా! ఆ మాట సాధారణంగా యిక్కడ యూనివర్సిటీల్లో మన వాళ్ళు వాడేదే! అంటే ఇండియా నించి, చదువు

ఎబిసిడి - అఆఇఈ...

కోటానికి ఇక్కడకు వచ్చే స్టూడెంట్సు, అమెరికాలో పుట్టి పెరిగిన ఇండియన్ కుర్రాళ్ళను వుద్దేశించి అనే మాటన్నమాట..."

"ముందు అదేమిటో చెప్పండి బాబూ - మీ సస్పెన్సూ, మీరూను!" అన్నది ప్రమీల.

ఈశ్వరరావ్ అన్నాడు నవ్వుతూ - "ఎబిసిడి అంటే అమెరికన్ బోర్న్ కన్ఫ్యూజ్డ్ దేశీ అన్నమాట".

"ఎందుకని అలా అంటారు?" అడిగింది ప్రమీల.

విక్రమరావ్ అన్నాడు - "అదా! ఇక్కడ పుట్టిన మన కుర్రాళ్లకు ఇండియా గురించి ఏమీ తెలియదనీ, ఇటు పూర్తిగా అమెరికన్ అలవాట్లకూ, అటు ఇండియా అలవాట్లకూ, కల్చర్‌కూ మధ్య కన్ఫ్యూజ్ అయిపోతారనీ అలా అంటారు".

"దట్ ఈజ్ నాట్ ట్రూ ఇన్ మోస్టాఫ్ ది కేసెస్!" అన్నాడు ప్రభు.

"అవును, ఉదాహరణకు మా వాడినే తీసుకోండి. వాడు ఇటు అమెరికన్ కుర్రాళ్ల తోనూ, అటు ఇండియన్స్‌తోనూ బాగా ఎడ్జస్ట్ అయిపోతాడు. ఇడ్లీలు ఎంత ఇష్టంగా తింటాడో, హేంబర్గరూ అంతే యిష్టంగా తింటాడు. బాన్ జోవి కాన్‌సర్ట్‌కి వెడతాడు. బాలసుబ్రమణ్యం కచేరీకి వెళ్ళడు కానీ, ఆయన తెలుగు పాటలు టేప్‌లో చాలా యిష్టంగా వింటూనే వుంటాడు-" అన్నది ప్రమీల.

"అందరూ అలా వుంటారని కాదండీ - ఇక్కడ పుట్టి పెరిగిన కుర్రాళ్ళు చాలా మంది, ఇండియా నుంచి వచ్చిన స్టూండెట్లను లెఖ్ఖ చేయరు. చాలా చిన్నచూపు చూస్తారు - వాళ్ళతో మాట్లాడటమే అమర్యాద అన్నట్లు ప్రవర్తిస్తారు. ఏదన్నా ఇండియన్ సినిమాల గురించి కానీ, పాటల గురించి కానీ, రాజకీయాల గురించి కానీ చెబితే అసలు ఉత్సాహం చూపించరు" రవి అన్నాడు.

"అవును - ఇండియాలో రాజకీయాలు ఎలా వుంటాయో, ఏం జరుగుతాయో మాకు తెలీదు. ఏదో ప్రైమ్ మినిస్టర్ గురించో, ఒకళ్ళిద్దరు ప్రముఖుల గురించో తెలుసు కానీ, అక్కడ జరిగే విషయాలతో సంబంధం లేదు. కనుక ఆ విషయాలు తెలియదు. ఇక్కడ వుండి, ఇక్కడే బ్రతికేవాళ్ళకి, పెద్దగా ఆ రాజకీయాలు తెలియవలసిన అవసరం లేదు. తెలియనందువల్ల, దేనికీ పనికిరాని వాళ్ళం కానఖ్ఖరలేదు కదా!" అన్నాడు ప్రభు.

సునీత అన్నది - "అలాగే ఇండియా నించి వచ్చే కుర్రవాళ్ళకు, అమెరికన్ హిస్టరీ కానీ, ఇక్కడి పద్ధతులు కానీ తెలీదు కదా. వాళ్ల ఇండియా గురించి వీళ్ళకు తెలీదని వెక్కిరించే బదులు, వీళ్ళ దగ్గర అమెరికా గురించి తెలుసుకోవచ్చు కదా!"

ప్రభు నవ్వాడు - "నాకు అప్పుడే ఇండియా నించి వచ్చిన కుర్రవాళ్ళు ఎలా వుంటారో తెలుసు. భయం, భయంగా మాట్లాడతారు. అతి వినయం, నెమ్మది. చాలా తక్కువగా మాట్లాడుతారు. ఏమాత్రం ముందుకు దూసుకుపోయే తత్వం వుండదు. ఇంగ్లీష్ కూడా ఇంకా

ఇండియన్ ఇంగ్లీష్ మాట్లాడుతారు కానీ, అమెరికన్ ఏక్సెంట్ అలవాటు చేసుకోరు. మాట్లాడరు. వింతగా వుంటుంది. కొన్నిసార్లు వాళ్ళు మాట్లాడేది అర్థం కాదు కూడా!"

ప్రమీల నవ్వింది - "బాగుంది, ఇండియన్ స్టూడెంట్సులో రెండు రకాల వాళ్ళు వున్నారనీ, వాళ్ళిద్దరి మధ్యా వైవిధ్యం వుందని అనుకోలేదు నేను!"

"ఇక్కడి ఆడపిల్లలు మరీను. ఇండియా నించి వచ్చిన కుర్రాళ్ళను పూర్తిగా తీసి పారేస్తారు. మాతో స్నేహం చేయటం కూడా తక్కువే" అన్నాడు రవి.

ప్రభు అన్నాడు - "అవును మరి మేవంటే మీకు లెఖ్క లేనప్పుడు, చులకనగా వున్నప్పుడు - మాకు మాత్రం మీమీద గౌరవం, నమ్మకం ఎలా వుంటుంది?"

విక్రమరావ్‌కి లెబనీస్ ఫుడ్ అన్నా కూడా యిష్టమే. పీటా బ్రెడ్ లోపల వెజిటబుల్స్, ఛీజ్ అన్నీ పెట్టి, కాస్త పచ్చిమిరపకాయలు తగిలిస్తే - వదలడు. అందుకే మాట్లాడకుండా - మాటలు వింటూ తింటున్నాడు.

సునీత అన్నది - "ఇంతకుముందు, ఈ మనస్తత్వాల్లో ఇంత తేడా కనపడేదే కాదు, ఇప్పుడు ఎక్కువయినట్టుంది!"

ఈశ్వరరావ్ అన్నాడు - "దానికి కారణం ఏమిటంటే, ఇప్పుడిక్కడ సెకండ్ జనరేషన్ - అంటే రెండో తరం - ఇండియన్స్ ఎక్కువ అవటం!"

ప్రమీల అన్నది - "కానీ ఈ రెండు రకాల పిల్లలూ, ఒకళ్ళకు తెలిసింది ఒకళ్ళకు చెప్పుకుని స్నేహంగా వుండి ఇద్దరి జీవితాలూ సుఖమయం చేసుకోవచ్చు కదా!"

"వచ్చు, చాల విభిన్న పరిస్థితులలో లాగానే, ఇదికూడా జరగవచ్చు. కానీ జరగదు - మన కుర్రాళ్ళు, ఇండియా నించి వచ్చిన కుర్రాళ్ళలో బాగా సఖ్యంగా వుంటే, చాలా విషయాలు తెలుసుకోవచ్చు. భాష, సంస్కృతి, దేశం, చరిత్ర అక్కడి చదువుల పద్ధతి, కుర్రవాళ్ళ నడత, వ్యవహారాలు - అన్నీను. దానితో వీళ్ళకు ఒక విధమైన గుర్తింపు, ఎవరయినా ఇండియా గురించి అడిగితే, అన్నీ చెప్పగలిగే స్తోమతా వస్తుంది. దాదాపు ఒకే వయసుల్లో వుంటారు కాబట్టి ఒకే రకంగా ఆలోచించి, ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకో గలరు!"

ప్రమీల అన్నది - "ఒకళ్ళ నొకళ్ళు నచ్చితే చక్కగా పెళ్ళిళ్ళు కూడా చేసుకోవచ్చు. అమెరికన్లను చేసుకుని మన దేశానికి దూరం అయ్యే కన్నా ఇది నయం కదా!"

సునీత అన్నది - "వీళ్ళు చదువు పూర్తవగానే ఇమ్మిగ్రేషన్‌కి ప్రయత్నాలు చేస్తారు కదా - కొంతమందికి అదృష్టం బాగుండి వీసా యిప్పించే ఉద్యోగాలు దొరుకుతాయి. కొంతమంది చాలా అవస్థలు పడతారు - వీసా కోసం. వాటిల్లో పెళ్ళి ఒకటి అని ఇక్కడి వాళ్ళు అనుకుంటారు!"

ఈశ్వరరావ్ అన్నాడు - "దాన్లో తప్పేముంది - మనమంతా చదువుకోవడానికి వచ్చి,

ఇమ్మిగ్రేషన్ తీసుకుని ఈ దేశ వాసులం అయిన వాళ్ళమే కదా - మనలాగే వీళ్ళూనూ - కాకపోతే ముందు, వెనుక".

"అసలు అమెరికా ఈజ్ ఎ కంట్రీ ఆఫ్ ఇమ్మిగ్రెంట్సు కదా" అన్నాడు రవి.

విక్రమరావ్ తినటం ఆపి అడిగాడు - "రవీ - ప్రభూ - ఈ విషయంలో ఏం చేస్తే పరిస్థితులు బాగుపడతాయో చెప్పండి"

ప్రభు, "ఐ డోంట్ నో - దే హావ్ టు ఆస్క్ వాట్ దే వాంట్" అన్నాడు.

రవి అన్నాడు - "ఈ మధ్యనే ఆస్టిన్ తెలుగు అసోసియేషన్ వాళ్ళు ఒక మంచిపని చేశారు. మురళీకృష్ణన్ అనే తమిళ కుర్రాడు ఇక్కడ ఒంటరిగా వుండేవాడు. ముక్తసరి. అతనికి స్నేహితులు తక్కువ. ఆర్థికంగానూ, సాంస్కృతికంగానూ, ఇక్కడ చదువు చెప్పే పద్ధతిలోని తేడాల వలనా, మన ఆహారం దొరక్క పోవటం వలనా, అన్నిటికన్నా ముఖ్యంగా ఒంటరితనం వలనా, మానసికంగా చాలా దెబ్బ తిన్నాడు. ఒక రోజు, ఎవరికీ చెప్పకుండా టౌన్ లేక్‌లో పడి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం ఆస్టిన్‌లోని ఇండియన్సు అందర్నీ కలవర పరచింది. దానితో తెలుగు అసోసియేషన్ కార్యకర్తలు ఆలోచించి 'స్టూడెంట్ హోస్ట్' ప్రోగ్రామ్ అని మొదలు పెట్టారు. అంటే ఈ కార్యక్రమంలో ముందుకు వచ్చిన ప్రతి కుటుంబమూ, అతిథులుగా ఇద్దరు ముగ్దురు స్టూడెంట్సును ఆహ్వానిస్తారు. అతిథులకూ, ఆతిథ్యం ఇచ్చే వారికీ వీలున్నప్పుడల్లా, వాళ్ళు కలుస్తుంటారు. కలసి కబుర్లు చెప్పుకుంటారు. భోజనాలు చేస్తారు. పిక్నిక్‌లకు వెడతారు. ఇలా స్టూడెంట్సు ఏదన్నా సహాయం కావాలంటే చేస్తారు. స్టూడెంట్సు కూడా, టీచింగ్ అసిస్టెంట్సుగా, తమ ఖర్చులు తాము సంపాదించుకుంటారు. కనుక, పెద్ద ఆర్థిక అవసరాలు ఏమీ రావు. కానీ తమని కనిపెట్టి వుండే ఒక కుటుంబం అండగా వుందనే ధైర్యం వాళ్లకు కొండంత బలాన్నిస్తుంది. స్టూడెంట్సు అలా మన ఇండియన్ ఫామిలీస్‌తో కలిసిపోతే, ఈ ఎబిసిడిల వైవిధ్యాలు కూడా వుండవు. మొదట్లో దూరదూరంగా వున్నా తర్వాత కలిసిపోతారు".

సునీత అడిగింది - "మరి ఈ ప్రోగ్రామ్ బాగా నడుస్తున్నదా?"

రవి నవ్వాడు - "అన్నిటి లాగానే ఇదీనూ - కొంతమంది చాల సీరియస్‌గా తీసుకుని పాటిస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా కలుస్తున్నారు. కొంతమంది దగ్గర ఇది ఆగిపోయింది. కాని మంచి కాన్‌సెప్ట్. మిగతా అసోసియేషన్లు కూడా ఆస్టిన్ తెలుగు అసోసియేషన్ని చూసి నేర్చుకోవలసిన విషయం".

వెయిటర్ బిల్ తీసుకు వచ్చి యిచ్చింది.

"ఇక రోడ్డెక్కుదామా - హాస్టల్‌కి పోయేసరికి బాగా ఆలస్యం అవుతుంది!" అన్నాడు ఈశ్వరరావ్, క్రెడిట్ కార్డ్ బల్ల మీద పడేస్తూ.

"పోదాం - ఈ ఎబిసిడిలను, అఆఇఈలను కలిపే ప్రయత్నానికి కథా వస్తువు

దొరికింది కదా!" అన్నాడు విక్రమరావ్.

"అఆఇఈ... అంటే..." అడిగింది ప్రమీల.

"చెబుతాను... అదేమిటో మీరు ఆలోచించండి ముందు!" అన్నాడు విక్రమరావ్.

అందరూ ఆలోచనలో పడ్డారు. ఎవరికీ అంతు పట్టినట్టు లేదు.

రవి అడిగాడు - " అ ఆ ఇ ఈ అంటే ఏమిటండీ?" అని.

"నువ్వు, ప్రమీల ఎబిసిడి అంటే ఏమిటని అడిగితే చెప్పకుండా ఆవిడను నాలుగు గంటలు సస్పెన్సులో పెట్టావ్. మరి నేను వూరికే చెబుతాననుకున్నావా? వచ్చే సెమిస్టర్‌లో నీ గ్రాడ్యుయేషన్‌కి వచ్చినప్పుడు చెబుతాను!" అంటూ లేచాడు విక్రమరావ్.

"ఉండు - పే చెయ్యనీ!" అన్నాడు ఈశ్వరరావ్. వెయిటర్ క్రెడిట్ కార్డ్డు, బిల్లూ తీసుకోవటం చూసి.

విక్రమరావ్ నవ్వి, టాయిలెట్‌లోకి వెళ్లాడు. టాయిలెట్‌లో అడుగుపెట్టి తలుపు వేయగానే వెనుకనే వున్నాడు బేతాళుడు.

"ఛీ - ఇక్కడ కూడా ఏమిటి - వెనకే తయారయావ్" అన్నాడు విక్రమరావ్.

"బేతాళుడు రాకుండా - 'అమెరికా బేతాళుడి కథ' పూర్తి చేయటం మర్యాద కాదు. నేనూ ఏమీ తోచక కాన్వకేషన్‌కి వచ్చి నీ ప్రక్కనే కూర్చున్నాను. రెస్టారెంటులో కూడా నీ ప్రక్కనే కూర్చున్నాను. కానీ అందరూ వున్నారు కనుక, కనపడకుండా, మాట్లాడకుండా కూర్చోవలసి వచ్చింది. ఇప్పుడు చెప్పు - నాకూ ఆసక్తిగా వుంది, 'అ ఆ ఇ ఈ' అంటే ఏమిటి?"

"చెబుతా నన్నాగా - రవి గ్రాడ్యుయేషన్‌కి -"

"ఆ రోజు అతనికి చెప్పు - ఇప్పుడు నాకు చెప్పు. తెలిసీ జవాబు చెప్పకపోతే ఏమవుతుందో నీకు తెలుసు!" బెదిరించాడు బేతాళుడు.

"ఓరి వెర్రి నాగన్నా - రవి 'ఎబిసిడి' అంటే, 'అమెరికన్ బోర్న్ కన్‌ఫ్యూజ్‌డ్ దేశి' అన్నాడు. అది ప్రభుకు నచ్చలేదు. అందుకే నేను అదే వరసలో 'అ ఆ ఇ ఈ' అన్నాను!"

"అంటే దానికి అర్థం లేదా...."

"అర్థం తీస్తే వుందనుకో... 'అమెరికా ఆనందాలాసించి ఇమ్మిగ్రేషన్ కోసం ఈదులాడే వాడు' అని. అర్థం అయిందా - ఇక ఫో! నా పని పూర్తి చేసుకోవాలి నువ్వు పద" అన్నాడు విక్రమరావు, ఫాంటు...

బేతాళుడు నవ్వి, ఎలా వచ్చాడో అలా చటుక్కున మాయమయిపోయాడు.

❖